క్లుప్తంగా

పశువులే స్పీడ్ బ్రేకర్లు



రాత్రి వేళల్లో రహదారికి అడ్డంగా నిలిచిన పశువులు

పార్వతీపురం రూరల్: పశువులు రహదారిపై సంచరిస్తూ రోడ్డుకు అడ్డంగా నిలిచి ఉండిపోవడంతో వాహన దారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో వేగంగా వెళ్తున్న వాహనాలకు ఎదురుగా వచ్చి పశువులు నిలిచిపోయి ఉండడంతో వాహన దారులు గమనించపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం ప్రధాన రహదారిపై నిత్యం ఇలా పశువులు మందల మందలుగా సంచరిస్తున్నప్పటికీ ఈ సమస్యకు సంబంధిత అధికారులు పరిష్కారం చూపడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు.

అందరికీ అందని అన్నదాత సుఖీభవ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములునాయుడు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా అందాల్సిన ఆర్థిక సహాయంలో ఆర్టీజీఎస్ పేరుతో కోత విధించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఎస్.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి నాయకులు అందిస్తామని ప్రకటించారన్నారు. అయితే ఇప్పటికే ఎన్నికల (జూలై నెలలో) సంవత్సరం ఇవ్వగపోగా రెండవ ఖరీఫ్ సీజన్‌కు రైతుల బ్యాంక్ ఖతాల్లో రూ.20 వేలు వేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ కాలం సగం అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సిన రూ.20 వేలు ఇంకా వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని ప్రకటించాయని ఎద్దేవా చేశార. ఈ నేపథ్యంలో తాజాగా పీఎం కిసాన్ పథకం ద్వారా మొదటి విడతగా కేంద్రప్రభుత్వం రూ.2 వేలు వంతున రైతులందరికీ బ్యాంక్ ఖాతాల్లో జమచేసిందని, రాష్ట్రప్రభుత్వం రైతాంగానికి ఇస్తామన్న రూ.5 వేలు చెల్లించాల్సిన అన్నదాత సుకీభవ పథకం కొంతమందికే బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని తెలియజేశారు. కొంతమందికి అన్నదాత సుఖీభవ పథకం పొందడానికి అన్ని అర్హతలున్నా ఆర్థిక సహాయం అందలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరినీ, కౌలు రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ప్రజా క్షేత్రంలో నిలదీస్తాం...



చిలకాం గ్రామంలో రీకాలింగ్ బాబు మేనిఫెస్టో పోస్టర్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గరుగుబిల్లి: ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రజలను అవస్థలకు గురి చేస్తున్న చంద్రబాబును, కూటమి నాయకులను హామీలు అమలు చేసే వరకు ప్రజా క్షేత్రంలో నిలదీస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం స్థానిక మాజీ ఉప ముఖ్యమంతి పాముల పుష్పశ్రీ వాణి పిలుపు మేరకు మండలంలోని చిలకాం, దత్తివలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామాల్లో కూటమి ప్రజలకు చేసిన మోసాన్ని గడప గడపకు వెళ్లి వివరిస్తూ ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, నాయకులు తెర్లి ఎల్లంనాయుడు, పి.వెంకటదామోదరరావు, ఎం.గౌరినాయుడు, గుంట్రెడ్డి చంద్రశేఖరరావు, శశికుమార్, శ్రీనివాసరావులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం



పార్వతీపురం రూరల్: బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న 2, 28 వార్డుల ప్రజలు



పార్వతీపురం రూరల్: తన పింఛన్ నిలిపివేశారని మాజీ ఎమ్మెల్యే జోగారావు వద్ద బాధను వ్యక్తం చేస్తున్న దివ్యాంగుడు గౌరునాయుడు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్:

అధికారం చేజిక్కించుకునేందుకు ఎన్నికల ముందు అబద్ధపు హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక మాట మార్చిన చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం పట్టణంలోని 2, 28 వార్డుల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. రెండు వార్డుల్లో ఉన్న వీధుల్లో గడపగడపకు వెళ్లి ఇంటింటికీ వంచన కరపత్రాన్ని ఇస్తూ కూటమి హామీ ఇచ్చిన పథకాలు ఏ మేరకు అందాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మళ్లీ ఎన్నికల వచ్చేంతవరకు కాలయాపన చేస్తే సహించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మోసపూరిత నాయకుడిగా చంద్రబాబు నిలిచిపోతారన్నారు.

దివ్యాంగుడి పింఛన్ నిలిపివేత

రెండవ వార్డుకు చెందిన ఎస్. గౌరినాయుడు అనే దివ్యాంగుడికి అన్యాయంగా పింఛన్ రాకుండా చేశారని కుటుంబసభ్యులు తన వద్ద వాపోయినట్లు తెలిపారు. ఇటీవల పరిశీలన పేరుతో మాటలు రాని గౌరినాయుడికి యాప్‌లో అటెండెన్స్‌కు హాజరు కాలేదన్న నెపంతో పింఛన్ నిలిపివేసినట్లు తెలిసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ విధంగా పేదలను ఇబ్బందులకు గురిచేస్తూ రోడ్డుపైకి లాగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకుడు రెడ్డి రవికుమార్, కౌన్సిలర్లు ఎస్.లావణ్య, చీకటి అనూరాధ, త్రినాథ, సుధీర్, నేతాజీ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల నాయకులు డి.నాగరాజు, జి. భాగ్యలక్ష్మి, పోల సత్యనారాయణ, ఎస్‌వీఎన్ రెడ్డి, పోల సుధ, వార్డుల ఇన్‌చార్జ్‌లు జి.గాయత్రి, సీహెచ్ ఆనంద్‌లతో పాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఇది



బలిజిపేట: మహిళలకు వివరిస్తున్న తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీకాంత్, నాయకులు

బలిజిపేట: కూటమి ప్రభుత్వ విధానాలు ప్రజా వ్యతిరేక విధానాలని, అన్ని వర్గాలను మోసం చేసిన ప్రభుత్వమని తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం.శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని గంగాడలో చంద్రబాబు ష్యూరిటీ-మోసం పక్కా గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేయించే బాధ్యత వైఎస్సార్ సీపీ తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.లక్ష్మి, ఎంపీటీసీ డి.శంకరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, రైతు విభాగం మండలశాఖ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, జి.సూర్యనారాయణ, బి.నారాయణరావు, ఎ.పకీరునాయుడు, జి.వెంకటినాయుడు, ఎస్.జగన్మోహనరావు, సర్పంచ్‌లు ఎన్.పాపారావు, సుందరరావు, జగన్, పెరిక బలిజ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు, టీసీలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులు భద్రతా నియమాలు పాటించాలి

సీతానగరం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జాతీయ రహదారిలో అప్పయ్యపేట- సీతానగరం గ్రామాల మధ్య రైల్వే జంక్షన్ సమీపంలో సిబ్బంది సహకారంతో ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను వాహన చోదకులు పాటించాలని చెప్పారు. ప్రమాదాలు నివారించడానికి అన్నివిధాలా తనిఖీలు చేస్తున్నామన్నారు. అలాగేఇంటి వద్ద వాహనాలు తీసే సమయంలో వాహనానికి సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండాలని, డ్రైవింగ్ చేస్తున్న వారు విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై డి.లక్ష్మణరావు, హెచ్‌సీ తిరుపతిరావు, సిబ్బంది నరేంద్రబాబు, సురేష్ పాల్గొన్నారు.



సీతానగరం: మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

నిబంధనలు పాటించకుంటే చర్యలు

పార్వతీపురం రూరల్: రహదారిపై వాహన చోదకులు ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రూరల్ పరిధిలో పలు ప్రధాన కూడళ్ల వద్ద ఆమె వాహన తనిఖీలు చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా సిబ్బందితో కలిసి పరిశీలించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, గంజాయి, అక్రమ రవాణాను నిరోధించేందుకు ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే రహదారి భద్రత నిబంధనలు పాటించాలని అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.



పార్వతీపురం రూరల్: వాహనాలు తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి

స్మార్ట్ మీటర్లు వద్దని సీపీఎం ప్రచారం

సీతానగరం: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో (ఏపీఈపీడీసీఎల్) ఇళ్లలో అమర్చనున్న స్మార్ట్ మీటర్లు అమర్చవద్దని సూచిస్తూ గ్రామాల్లో జరుగుతున్న ప్రచారం, అవగాహన సదస్సుల్లో ప్రజలు అవగాహన కల్పించు కోవాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి ఈశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట గ్రామంలో గల రచ్చబండ వద్ద విద్యుత్ వినియోగదారులతో సీపీఎం నాయకులు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ విద్యుత్‌మీటర్ల పేరుతో విద్యుత్‌చార్జీలు పెంచడానికి దోహద పడతాయని, వినియోగదారులపై ప్రైవేట్ కంపెనీలు ఇష్టాను సారం పెనుభారం పెంచుతాయని ఆరోపించారు. విద్యుత్‌చార్జీలు పెరిగితే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దవుతాయని తెలియజేశారు. అనంతరం రెడ్డివానివలస, రామవరం, కాశీపేట, మండల కేంద్రంలోని వీధుల్లో స్మార్ట్ మీటర్ల వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లు వద్దని తీవ్రంగా వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఇప్పుడెలా స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు అంటగడుతుందని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధం



ప్రభుత్వ ఉత్తర్వులను దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

- ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన

పార్వతీపురం టౌన్: విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధం విధించడం సరైన విధానం కాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద ఆదివారం ప్రభుత్వ ఉత్తర్వులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యా రంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తాయన్నారు. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై ప్రభుత్వం నిషేధం విధించడం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్య అని ఆరోపించారు. ప్రధానంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలన్నీ కూటమి ప్రభుత్వ నాయకులవేనని ఆ పాఠశాలల ఫీజుల దోపిడీ.. పుస్తకాలను అధిక ధరలు అమ్ముకోవడం, విద్యను వ్యాపారం చేసుకోవడానికి వారి మేలుకోసమే ఈ ఉత్తర్వులన్నారు. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, ప్రజా జీవితంపై అవగాహన, హక్కులు, బాధ్యతలను విద్యార్థి సంఘాలు తెలియచేస్తాయని రవికుమార్ పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు విద్యార్థి హక్కులపై దాడిగా భావిస్తూ, తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వికాస్ చరణ్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పీఈటీని సస్పెండ్ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల పీఈటీని సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులను అక్కడి పీఈటీ ఇటీవల దారుణంగా కొట్టారని ఆరోపించారు. జరిగిన సంఘటనపై అధికారులు విచారణ చేపట్టి వాస్తవమేనని నిర్ధారించారని పేర్కొన్నారు. కానీ నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సురేష్ పేర్కొన్నారు.

పారిశుధ్యం ప్రకటనలకే పరిమితం

పార్వతీపురం రూరల్: జిల్లా అధికారులు పలు సమావేశాలు నిర్వహించి పారిశుద్ధ్య పనులు మెరుగ్గా అందించాలని మండల స్థాయి, గ్రామీణ స్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్నా అధికారుల ఆదేశాలు ప్రకటనలకే పరిమితమయ్యాయేతప్ప ఆచరణలో కానరావడం లేదు. జిల్లా కేంద్రంలోని వైకేఎం కాలనీ సమీపంలో సాక్షాత్తు మున్సిపాల్టీ వారు ఏర్పాటు చేసిన స్వాగతం శిలాఫలకం వద్దే అధ్వానంగా నీటి నిల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దోమలు, ఇతర కీటకాలకు ఆవాసాలుగా మారాయి. నిత్యం పక్కనే ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై జిల్లా అధికారులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఏ ఒక్క అధికారికి ఈ నిర్లక్ష్యం కనిపించడం లేదా? అని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



పట్టణ ప్రారంభంలో మురుగునీటిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం

5న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాకు కదలిరండి

- వామపక్ష ప్రజాసంఘాల పిలుపు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను అడ్డగోలుగా బిగించే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల ఐదవ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు కదిలిరావాలని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం పట్టణంలోని జగన్నాథపురం ఒకటవ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పేరుతో వినియోగదారులపై మరింత భారం వేయొద్దన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా వస్తే ప్రజలందరూ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించాలని, ఈనెల 5న పార్వతీపురం జిల్లా కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



జగన్నాథపురంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్‌కుమార్, సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, ఎస్.ఉమ, డీవైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, వీధుల్లో గల మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో..

భూగర్భ జలాల పెంపు



గతంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భామిని: నీటిని సంరక్షించుకోకపోవడంతో నీటి ఎద్దడి పరిస్థితులు ఎదుర్కొంటున్నామని పర్యావరణవేత్తలు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలను పెంపొందించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అలాగే జిల్లాలో ప్రధాన నదులైన వంశధార, నాగవళిలో నీటి ప్రవాహం అంతంత మాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో భూగర్భ జలాలు పెంపొందించుకునేందుకు అధికారులు ఇంకుడుగుంతల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని భూమిలో ఇంకేటట్లు చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్ వాసులు ఇంటిపై నుంచి వచ్చే వర్షపు నీటిని పైపుల ద్వారా చిన్న సంపు లేదా ఇంకుడు గుంతల్లోకి మళ్లించాలి. ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పుడే సమీపంలో ఇంకుడు గుంత నిర్మించుకోవడం మేలని అధికారులు సూచిస్తున్నారు.



పొలంలో నీరు ఇంకేందుకు ఏర్పాటు చేస్తున్న ఫారంపాండ్

అవగాహన తప్పనిసరి..



నీటి సంరక్షణపై అవగాహన తప్పనిసరి. భూగర్భ జలాలను పెంపొందించుకుంటేనే భవిష్యత్ తరాలకు మనుగడ ఉంటుంది. సగటును కురిసే వర్షంలో 20 శాతం నీటిని సంరక్షించుకుంటే భవిష్యత్‌లో ఇంటి అవసరాలు తీరుతాయి.

డాక్టర్ జీ.ఎస్.నాయుడు, జియాలజీ లెక్చరర్, భామిని

ఉపాధి పథకం ద్వారా నిర్మాణం..



ఉపాధి పథకంలో భాగంగా ఫారంపాండ్స్ పేరిటి భారీ గుంతలు నిర్మిస్తున్నాం. రైతుల భూముల్లో వీటిని ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాలు పెంపొందడంతో పాటు పంటలకు సాగునీరు అందుతుంది.

జి.శ్రీహరి, ఏపీడీ, ఎస్ఆర్ఈజీఎస్, పాలకొండ

వాల్టా చట్టం ప్రకారం..

వాల్టా చట్టం ప్రకారం 200 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టే అన్ని నిర్మాణాల వద్ద వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉంది. ఆ తర్వాత ఆ విస్తీర్ణాన్ని 3000 చదరపు మీటర్లకు పెంచినా.. ఇంకుడు గుంతల నిర్మాణంలో మాత్రం ప్రజలు అలసత్వం వహిస్తున్నారు. పార్కులు, కాలనీల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల్లోకి వర్షపు నీటిని పంపించడం ద్వారా సమీపంలో ఉన్న బోరు బావుల నుంచి సంవత్సరం పొడవునా నీరు వస్తుంది. అలాగే బోర్ల వద్ద కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయాలపై అధికారులు ముమ్మర ప్రచారం చేపడుతున్నా.. ప్రజలు పూర్తిస్థాయిలో ముందుకు రావడం లేదు.

అనుమానితులపై దృష్టి

పాలకొండ రూరల్: జనావాసాల మధ్య తిరుగాడే అనుమానిత వ్యక్తులపై ప్రజలు దృష్టి సారించాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. పట్టణంలో గారమ్మ కాలనీ, నీలమ్మ కాలనీతో పాటు మురళీమోహన్‌నగర్, వెంకటరాయుని కోనేరు, వీరఘట్టం రహదారి పరిసరాల్లో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా వాహన తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. ఈయన వెంట ఎస్సై ప్రయోగమూర్తి, సిబ్బంది ఉన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

వీరఘట్టం: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఎస్సై జి. కళాధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కొత్తబస్టాండ్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. డ్రైవర్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సరికొత్త వ్యాపారం..



టీడీపీ కూటమి దెబ్బకు ఎండీఎం వాహన డ్రైవర్లు, వలంటీర్లు రోడ్డున పడిన సంగతి తెలిసిందే. అయితే బత్తిలికి చెందిన ఎండీఎం నిర్వాహకుడు మిన్నారావు ప్రభుత్వం మోసం చేసినా బాధపడకుండా వాహనంలో సరికొత్త వ్యాపారానికి శ్రీకారం చుట్టాడు. వాహనంలో శానిటేషన్ పనులకు సంబంధించిన వస్తువులు వేసుకుని ఊరూరా తిరుగుతూ విక్రయిస్తున్నాడు. ప్రభుత్వం మా జీవితాలతో ఆడుకున్నా.. కుటుంబాన్ని పోషించుకోవడానికి వ్యాపారం చేస్తున్నానని సదరు వ్యక్తి తెలిపాడు. – భామిని